ప్రజాశక్తి

సోమవారం 26 జూన్ 2023

5

అల్లూరి సీతారామరాజు

తాగునీటికి అవస్థలు

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు నిర్మించినప్పటికీ చుక్క మంచినీరు కూడా అందలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామస్తులంతా ఒక్కటై మంచినీటి కోసం రాచకొండ పర్వతంపైకి వెళ్లి మంచినీరు వచ్చే పైపులైను పరిశీలించారు. చిన్న మరమ్మతు చేపట్టి మంచినీరు వచ్చే ఏర్పాటు చేశారు. ఇంటింటి కుళాయిలు తూతూ మంత్రంగా నిర్మించారని అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మంచినీరు అందే టట్టు చూడాలని గ్రామస్తులు తెలిపారు.

నిరుపయోగంగా కుళాయి

గోదావరి ఉప్పెనలా...

- ఉత్సాహంగా పోలవరం పోరుకేక మహాపాదయాత్ర
- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సంపూర్ణ సంఘీభావం

హారతులిచ్చి స్వాగతిస్తున్న పోలవరం నిర్వాసిత మహిళలు

పోరుకేక మహాపాదయాత్ర సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, వేదికపై వి.శ్రీనివాసరావు, ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి, విఆర్ పురం, కూనవరం

పోలవరం నిర్వాసితుల పోరుబాట గోదావరి ఉప్పెనలా... ముందుకు సాగుతోంది. ఈనెల 20వ తేదీన ఎటపాక మండలం నెల్లిపాకలో సిపిఎం ఆధ్వర్యంలో పోరుకేక మహా పాదయాత్ర ప్రారంభమైన విషయం విధితమే. ఆరో రోజైన ఆదివారం వీఆర్ పురం మండలంలో సుమారు 20 కిలోమీటర్లు పాదయాత్ర నడిచింది. దీంతో మొత్తం 120 కిలోమీటర్ల మార్కును దాటి ముందుకు సాగుతోంది. గ్రామ గ్రామాన పోలవరం నిర్వాసితులను కలుపుకుంటూ వెళుతున్న ఈ యాత్ర విశేష జన మద్దతు లభిస్తోంది. జెండాలకు అతీతంగా, ఒకే అజెండాతో రాజకీయ పక్షాలు సంఘాలు ఏకమవుతున్నాయి. పాదయాత్ర ఆహ్వానించి తమ మద్దతును తెలుపుతున్నాయి. ఆదివారం ఉద్యోగ,ఉపాధ్యాయ, రైతు, గిరిజన తదితర ఎనిమిది సంఘాలు పాదయాత్రకు మద్దతు తెలిపాయి. రామవరంలో మొదలైన పాదయాత్ర అడవి వెంకన్నగూడెం, సున్నంవారిగూడెం మీదుగా రాత్రికి రేఖపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా సుమారు ఆరు గ్రామాల్లో నిర్వాసితులు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో పాదయాత్రకు విన్నవించారు. తమ కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఉద్యమ నేత మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఈ కష్టకాలంలో లేకపోవడం తీరని లోటని ఉమ్మిడివరానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాయం రామారావు ఓ బహిరంగ సభలో వెల్లడించటం ఆదివాసి హృదయాల్లో సున్నం రాజయ్య చెరగని ముద్ర వేశారని స్పష్టమవుతోంది. రంపచోడవరం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సున్నవారిగూడెంలో జరిగిన మహాసభలో పాల్గొని తన సంఘీభావం తెలిపారు. పోలవరం నిర్వాసితులు ఏకం కావలసిన అవసరాన్ని స్పష్టం చేవారు.

సమస్యలు వింటూ.. ముందుకు సాగుతూ..

పోలవరం నిర్వాసితుల సమస్యలను వింటూ పాదయాత్ర ముందుకు సాగుతోంది. సోములగూడెంలో 150 కుటుంబాలు ఉన్నాయని, 38 మీటర్లకే వరద ముంచెత్తుతున్నా ప్రభుత్వం 45వ కాంటూరులో ప్రకటించిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వరదలకు ఇల్లు కూలిపోయిన వారికి రూ.పదివేల ఆర్థిక సహాయం కేవలం 20 శాతం మందికి ఇచ్చారని వాపోయారు. తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం లేదని, సవరణది నీటిని పైప్ లైన్ ద్వారా సదుపాయం కల్పించాలని కోరిన ముంపు ప్రాంతాల్లో అభివద్ధి చేయలేమని అధికారులు చెబుతున్నారని తెలిపారు. లక్ష్మీనగరంలో 120 కుటుంబాలుండగా, ఇక్కడా 38 మీటర్లకే గ్రామం ముంపునకు గురవుతున్నా 45.72 కాంటూరులో చేర్చారని వాపోయారు. గత ఏడాది వరదల కాలంలో ఐదు కేజీల బియ్యం, నాలుగు ఉల్లిపాయలు, టమోటాలు బంగాళదుంపలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది వచ్చిన వరదలకు కూలిపోయిన ఇళ్లకు పరిహారం కేవలం 25 శాతం మందికి చెల్లించినట్లు వివరించారు. అడి వెంకన్నగూడెంలో 130 కుటుంబాలు ఉన్నాయని, 41.15 కాంటూరులో చేర్చినప్పటికీ ఎటువంటి సహాయ కార్యక్రమాలు అందలేదని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన గ్రామాలలో మూడు గ్రామాలకు మాత్రమే పునరావాసం కల్పిస్తున్నారని, ఎక్కడ కోరుకుంటే అక్కడ పునరావాసం కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. సున్నంవారిగూడెం లో 64 కుటుంబాలు ఉన్నాయని గ్రామంలో ఇల్లు పాక్షికంగా మునిగినా చుట్టుపక్కల వ్యవసాయ భూములు రహదారులు పూర్తిగా మునిగిపోయాయని తెలిపారు కానీ ముంపు గ్రామంగా ప్రకటించలేదని, తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో తాగునీరు, రహదారి సమస్యలు ఉన్నాయని వివరించారు. చిన్నమట్టపల్లిలో 120 కుటుంబాలు ఉన్నాయని, గ్రామం పూర్తిగా మునిగిపోయిన ముంపు గ్రామంగా ప్రకటించలేదని తెలిపారు ప్రభుత్వం నుంచి వరద సమయంలో ఎటువంటి సహాయము అందలేదని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.2000 ఆర్థిక సహాయం ఇంటి శుభ్రం చేసుకోవడానికి కూడా సరిపోలేదని, ఈ ప్రాంతంలో రహదారులు మంచినీటి సమస్య ఉందన్నారు. పెద్దమటపల్లిలో 700 కుటుంబాలు ఉన్నాయని వరద కొన్ని కుటుంబాల ఇళ్లకు పాక్షికంగా వచ్చిందని తెలిపారు. రహదారులు వ్యవసాయ భూములు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని తెలిపారు పంచాయితీ పరిధిలో ప్రతి సంవత్సరం మూడు గ్రామాలు నూతిగూడెం గుర్రంపేట మెట్టగూడెం ముంపునకు గురవుతున్నాయన్నారు. కాంటూరుతో సంబంధం లేకుండా ముంపు గ్రామాలుగా ప్రకటించాలని కోరారు.

ప్రతిపాకలో 180 కుటుంబాలుండగా, వరదలకు ముంపునకు గురైనా, ఇప్పటివరకు పరిహారం అందించలేదని తెలిపారు. చింత రేగుపల్లిలో 600 కుటుంబాలు ఉన్నాయని 38 మీటర్ల ఎత్తుకే వరద ముంచెత్తుతున్నప్పటికీ, 45.7.2 కాంటూరులో గ్రామం ఉందని వాపోయారు. వ్యవసాయ భూముల్లో 500 ఎకరాల పంట నష్టం జరిగిందని, అయినా ఎటువంటి నష్టపరిహారము ప్రభుత్వం అందించలేదని విన్నవించారు. కన్నాయిగూడెంలో 35 కుటుంబాలు ఉన్నాయని, గ్రామాన్ని గోదావరి వరద ముంచెత్తుతున్నా, ప్రభుత్వం నేటికీ ముంపు గ్రామంలో ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడివరంలో 246 కుటుంబాలు ఉన్నాయని, గ్రామం పూర్తిగా ముంపునకు గురైనా ముంపు గ్రామంగా ప్రకటించలేదని స్థానికులు విన్నవించారు. . 45.7.2 కాంటూరు పరిధిలో ఉన్నప్పటికీ వ్యవసాయానికి సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని, పండించిన ధాన్యం అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని వారంతా వాపోయారు. గ్రామంలో తాగునీరు, రహదారి సమస్య ఉందని వాపోయారు.. అన్నవరం గ్రామంలో 300 కుటుంబాలుండగా, వరదలకు పూర్తిగా గ్రామం ముంపునకు గురైనట్లు తెలిపారు. రేఖపల్లిలో 800 కుటుంబాలు ఉన్నాయని, ఈ ప్రాంతం పాక్షికంగా ముంపునకు గురవుతుందని తెలిపారు. 38 మీటర్ల ఎత్తుకే గ్రామాన్ని వరదనీరు చుట్టుముడుతుందని పోరుకేక బృందానికి వివరించారు. రేఖపల్లి జల సమాధి అయిపోతోందని వాపోయారు. ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరారు. పూర్తిస్థాయిలో సర్వే చేయలేదని, పంట భూములు కూడా ముంపులో చేర్చాలని కోరారు.

పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్రలో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎంపిపి కారం లక్ష్మి, ఎంపిటిసి ప్రదీప్ కుమార్, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ, రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, వడ్లాది రమేష్, పొడియం శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, అచ్యుతరావు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సున్నం రాజయ్య లేని లోటు తీర్చలేనిది

ఆదివాసీలు కష్టాల్లో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య తన జీవితాంతం గిరిజన హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించి ప్రజల హదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన లోటు తీర్చలేనిది. పోలవరం నిర్వాసితుల పూర్తి యాత్రకు టిడిపి నాయకుడిగానే కాక, ఓ ఆదివాసిగా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాను.

పాయం రామారావు, టిడిపి నేత, ఉమ్మడివరం

వికలాంగులకు తీరని అన్యాయం

ఉమ్మడిగా రాష్ట్రంగా ఉన్నప్పుడు సైకిళ్ల ఇచ్చారు, కానీ రాష్ట్రం విడిపోయిన తర్వాత టిడిపి ప్రభుత్వంగానీ, వైసిపి ప్రభుత్వంగానీ మాకు ఇంతవరకు వెహికల్స్ ఇవ్వలేదు. మాకు వచ్చే నిధులు కూడా ఖర్చు పెట్టడం లేదు. ఈ సమస్యపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు స్పందించారు. వికలాంగులకు న్యాయం చేసేలాగా చూస్తామని హామీ ఇచ్చారు.

శ్రీనివాసరావుతో ప్రసాదు, వికలాంగుడు, లక్ష్మీనగరం

మహాపాదయాత్ర సభలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

మహాపాదయాత్రలో మేము సైతం అంటూ చిన్నారులు

పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న సిఐటియు, యుటిఎఫ్ నేతలు

పట్టుబడిన గంజాయి

400 కిలోల గంజాయి స్వాధీనం

- వాహన ప్రమాదంతో పట్టుబడిన వైనం

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఘాట్లో ఆదివారం ఉదయం జరిగిన వాహన ప్రమాదంతో భారీగా రవాణా చేస్తున్న గంజాయి గుట్టు రట్టయింది. దీని వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు సుమారు 400 కిలోల గంజాయి వేసుకొని వెళుతున్న మహీంద్రా ఎక్స్ యువి వాహనం ఆదివారం ఉదయం పాడేరు మండలంలోని మినుములూరుకు సమీపంలో ఉన్న పోతురాజు గుడి వద్ద ఒక మలుపులో ఎదురుగా వస్తున్న ట్యాంకర్ లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో గంజాయి తరలిస్తున్న వాహనం ముందు బాగమంతా గట్టిగా దెబ్బతిని మొరాయించింది. ఈ వాహనం కదలక పోయే సరికి గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు వాహనాన్ని అక్కడే విడిచి పరారయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా బస్తాలతో ఉన్న గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. వెంటనే వాహనంలో ఉన్న గంజాయిని పోలీస్ స్టేషన్కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాడేరు పోలీస్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఈ వాహనంలో ఇంకా వేరువేరు రాష్ట్రాల పేరుతో ఉన్న వాహనం నెంబర్ ప్లేట్లను పోలీసులు కనుగొన్నారు. మన్యం నుంచి భారీగా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేసేందుకు పోలీసులు ఆరా తీస్తున్నారు.

ప్రమాదానికి గురైన గంజాయి తరలిస్తున్న కారు

రేకుల షెడ్డులోనే విద్యార్థుల చదువులు

-పట్టించుకోని విద్యాశాఖ అధికారులు - గత్యంతరం లేక గ్రామస్తులు నిర్మించుకున్న షెడ్డు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:ప్రభుత్వ బడులను నాడు నేడు పేరుతో రూపురేఖలు మారుస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెపుతున్నా అవి ఎక్కడా అమలు కాలేదు. అరకువేలి మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద(జిపిఎస్) గిరిజన ప్రాథమిక పాఠశాల భవనం లేక గ్రామస్తులు నిర్మంచిన రేకు షెడ్డులోనే విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాత పాఠశాల భవనం గత ఏడాది శిథిలావస్థకు చేరి భారీ వర్షానికి కూలి పోయింది. దీంతో, గ్రామస్తులు జిల్లా కలెక్టర్, పిఓ, ఎమ్మెల్యే శెట్టి పాల్గుణకు తెలియజేశారు. అయినా పాఠశాల భవనం నిర్మిచలేదు. తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు ఇంటింటికి రూ.1000 చందాలు పోగు చేసుకుని చిన్న రేకుల షెడ్డును నిర్మించుకున్నారు. వర్షాకాలంలో పాఠశాల రేకుల షెడ్డు కారి పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనం లేక తీవ్ర ఇబ్బందులు తప్పలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.అధికారులు ప్రభుత్వం స్పందించి పిరిబంధ గ్రామంలో నూతన పాఠశాల భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల విద్యార్థులు

పాఠశాల షెడ్డు ఇదే..

జిల్లాకు చేరిన వివి ప్యాడ్స్

-కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
-పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:సుమారు 3100 ఎన్నికల వివి ప్యాడ్స్ ఆదివారం అల్లూరి జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఉప కలెక్టర్ వివిఎస్ శర్మ, పాడేరు మండల తహసిల్దార్ త్రినాధరావు నాయుడు మూడు రోజుల క్రితం బెంగళూరులో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీ నుండి 3100 వి.వి ప్యాడ్లను మూడు కంటైనర్లలో అత్యంత భద్రత మధ్య జిల్లా ప్రధాన కేంద్రం పాడేరుకు తీసుకు వచ్చారు. ఉదయం పాడేరు చేరుకున్న వివి ప్యాడ్లను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈవీఎం వేర్ హౌస్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సంయుక్త కలెక్టర్ జె శివ శ్రీనివాసు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పర్యవేక్షణలో కట్టు దిట్టమైన భద్రతతో జాగ్రత్త పరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు 24 గంటలు పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ వివిఎస్ శర్మ, బిజెపి, బీఎస్పీ, ఐఎన్సి, సిపిఐ, సిపిఎం, వైఎస్ఆర్సిపి, టిడిపి పార్టీల ప్రతినిధులు కె.రాఘవేంద్రరావు, ఎం పండన్న, వి.కృష్ణారావు, జె.రాజబాబు, వి.దాసు, ఎస్ మంగన్న దొర, బి.జ్యోతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రపరుస్తున్న వివి ఫ్యాడ్స్

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

- జెడ్పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి:వేపాడ మండలంలో క్వారీ పనులు చేస్తూ మతి చెందిన మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని జెడ్పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం సోంపురం నల్లరాయి క్వారీ పనులకు వెళ్లిన టోకురు పంచాయతీ పూలగూడ గ్రామానికి చెందిన గెమ్మెల. బుద్ద మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకొన్న జెడ్పిటిసి గంగరాజు శనివారం సాయంత్రం ఈ సంఘటనకు సంబంధిత కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఆ సాయంత్రం క్వారీ యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపినప్పటికీ కొలిక్కి రాలేదు. ఇదే విషయమై ఆదివారం ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్దకు చేరుకుని క్వారీ యజమాన్యం మృతుడి కుటుంబానికి కనీస నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చర్చలు జరపగా పరిహారానికి క్వారీ యజమాన్యం స్పందించిందని గంగరాజు పేర్కొన్నారు.పరిహారం చెల్లించడమే కాకుండా కుటుంబానికి ఇన్సురెన్సు, తదితరవి అందించి ఆదుకోవాలని కోరారు.లేబర్ చట్టం ప్రకారం ఇన్సూరెన్స్ అందే వరకు నెల కూలిలో సగం కూలి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా కుటుంబ పోషణం కోసం కూలి పని కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. క్వారీ యాజమాన్యం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జి నరసన్న, సిపిఎం మండల నాయకులు ఎస్.నాగులు, జి.దేవన్న, టిడిపి నాయకులు ఎస్.దొన్ను, కృష్ణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు

ఐద్వా మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:స్థానిక కళ్యాణ మండపం వద్ద ఆదివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నూతన మండల కమిటీని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, జిల్లా కార్యదర్శి హైమావతిల సమక్షంలో ఎన్నుకున్నారు. మహిళా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా యస్.ఈశ్వరి, కార్యదర్శిగా ఎస్.విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులుగా మీనా, రాధమ్మ, లలిత, కుమారి, దేవిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, మండలంలోని మహిళల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొచ్చి అండగా ఉండాలన్నారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష, కార్యదర్శి మాట్లాడుతూ, మహిళలు, బాలికలపై హింసను అరికట్టడానికి కృషి చేస్తామన్నారు. మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన ప్రత్యేక హక్కులను పరిరక్షించుటకు, స్త్రీలపై లైంగిక దాడులు, నిర్బంధాలను అరికట్టేందుకు పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండల అధ్యక్ష కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరి, ఎస్.విజయలక్ష్మి

శిథిలావస్థలో రహదారి

ప్రజాశక్తి-కోటవురట్ల:రాజుపేట రహదారి అధ్వానంగా ఉండటంతో ఆయా ప్రాంతాల వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా రోడ్డు శిథిలావస్థకు చేరుకున్నా కనీసం పట్టించుకునే నాధుడు లేడని గ్రామ వాసులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నల్ల పిక్క క్వారీ నుండి భారీ వాహనాలు నిత్యం పరిమితికి మించి రాత్రి, పగలని తేడా లేకుండా అధిక లోడుతో ప్రయాణించడంతో రోడ్డు శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వాహనాల రాకపోకులతో దుమ్ము ధూళితో సైతం ఇబ్బంది పడుతున్నామన్నారు. మండలం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో పలు మార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి.పి.రామన్నపాలెం,జంగాలపల్లి, రాజుపేట, కైలాసపట్నం వెళ్లే వరకు ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటు అధికారులు, అటు నాయకులు కనీసం రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదని ఆ ప్రాంత వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అధిక లోడుతో ప్రయాణించే వాహనాలను నిలువరించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలో వీరభద్రపేట పంచాయితీ శివారు గొప్పూరులో భోగుండమ్మ అమ్మవారి పండగ మహోత్సవం కార్యక్రమంనకు మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, వీరభద్రపేట నుండి గొప్పూరు వరకు సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు.తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యతగా ఈ సమస్యలను పరిస్కరిస్తామని ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగారపు పైడితల్లి, బడ్డు సత్తిబాబు, సింగారపు శివ, సింగారపు నాగరాజు, పల్లి రాజబాబు, పెదరాజు, చినరాజు, మాజీ సర్పంచ్ సబ్బవరపు గంగునాయుడు, వంటాకు కుమార్, మాజీ ఎంపీటీసీ కన్నూరు లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

చేనేత మగ్గాల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లిలో నేతన్న నేస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న మగ్గాలను చేనేత శాఖ ఏడి మురళీకృష్ణ, డివో రమణమ్మ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో గత ఏడాది నేతన్న నేస్తం పథకానికి 250 మగ్గాలకు అర్హత కలిగి ఉన్నాయన్నారు. ఈ ఏడాది 270 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 20 వరకు అనర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. అర్హులందరికీ నేతన్న నేస్తం పథకం కింద ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున ఖాతాల్లోకి నగదు జమ చేస్తారన్నారు. సొసైటీ ఇన్చార్జ్ నాగబాబు, వార్డ్ మెంబర్ బంగారు రాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి- చీడికాడ: ఆదివారం వచ్చిందంటే మండలంలోని అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలతో అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. చీడికాడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం వచ్చిందంటే చాలు అధికారులు విధుల్లో ఉండరని తెలుసుకుని అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపి యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో అనేకమార్లు పలు దినపత్రికల్లో ప్రచురించినా కూడా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. మండలం కేంద్రంలో వైసిపి యువ నాయకుడిగా చెప్పుకుంటున్న జెసిబి ఓనర్ అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నారు. ఈ తవ్వకాలకు అధికారుల నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా దర్జాగా అక్రమ మార్గంలో తవ్వకాలు జరిపి రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయాన్ని కొంతమంది పత్రికా విలేకరుల దృష్టికి తెచ్చారు. అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలపై జెసిబి ఓనర్‌ని ప్రశ్నించగా తనకేం కాదని, అధికారులతో మాట్లాడు కున్నామని సమాధానం ఇచ్చారు. ఎంత అడిగినా అనుమతులు మాత్రం తీసుకున్నట్లు చెప్పలేదు.

ఈ విషయంపై తహసిల్దార్ బి.వి.రాణిని ఫోన్లో వివరణ అడగ్గా.. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపిన జెసిబి ఓనర్ల పై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

అడ్డాకులు.. ఆదివాసీలకు ఆదాయ వనరు...

గుత్తులపుట్టు వారపు సంతలో వర్తకులు కొనుగోలు చేసిన అడ్డాకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్:ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ గిరిజనులు అడ్డాకులను సేకరిస్తారు. అడ్డాకులు ఆదివాసీలకు మంచి ఆదాయ వనరుగా చెప్పవచ్చు. తొలకరి వర్షాలు కురిసే వరకూ అడవుల్లో అడ్డాకులను సేకరించి ఆదాయం పొందుతారు. గిరి గ్రామాల్లో ఏ గృహ ఆవరణ చూసినా ఈ ఆకులే కనిపిస్తాయి.అదనపు ఆదాయం సమకూరుతుండటంతో అందరూ వీటిపై దృష్టి సారిస్తారు.
అడవుల్లో సేకరించిన ఆకులను ఎండబెట్టి, కట్టలుగా కడతారు. వాటిని కావడి (సుమారు 100 కిలోలు) చొప్పున వర్తుకులకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం కావడి ఆకులు రూ.600 నుంచి రూ.700 చొప్పున వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా వి.మాడుగుల, రావికమతం, కొత్తకోట, రోలుగుంట మండలాలకు చెందిన వర్తకులే వాటిని కొనుగోలు చేసి విస్తర్లుగా కుట్టి వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు.సీజన్ ప్రారంభంలో ధర కాస్త ఆశాజనకంగా ఉంటుందని, ముగిసే నాటికి ధర పడిపోతుందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్తకులు నిర్ణయించిన ధరకే విక్రయాలు

ఏజెన్సీలో గిరిజనులు సేకరించే అడ్డాకులకు ఎటువంటి మార్కెటింగ్

వారపు సంతల్లో విక్రయాలతో నష్టాలు
మార్కెటింగ్ సదుపాయానికి విన్నపాలు

సదుపాయాలు లేవు. గిరిజనులు వారపు సంతల్లో వర్తకులకు మాత్రమే వాటిని విక్రయించు కోవాల్సిన పరిస్థితి. వారపు సంతల్లో వర్తకులు నిర్ణయించిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదే మార్కెటింగ్ సదుపాయం ఉంటే తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గిరిజన రైతులు అభిప్రాయపడుతున్నారు.
ఏజెన్సీలో పదేళ్ల క్రితం వరకు అడ్డాకుల ఉత్పత్తితో పోల్చితే ప్రస్తుతం చాలా తగ్గిపోయింది. అడ్డాకుల సేకరణలో శాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడం, జిసిసి, అటవీ శాఖల పునరుత్పత్తి చర్యలు చేపట్టక పోవడంతో క్రమంగా ఆకుల ఉత్పత్తి క్షీణిస్తోంది. దీంతో పదేళ్లతో పోల్చితే ప్రస్తుతం అడ్డాకుల ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే కొన్నాళ్ళకి ఏజెన్సీలో అడ్డాకులు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉంది.

కట్టలను సంతకు మోసుకొస్తున్న ఆదివాసీలు

జూనియర్, డిగ్రీ కళాశాల

వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ధనలక్ష్మి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ధనలక్ష్మి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల వసతి గృహంలో ప్రహరీ గోడను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ మండల గర్ల్స్ కన్వీనర్ కె దనలక్ష్మి డిమాండ్ చేశారు. అరకువేలి ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల మహిళా వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులపై ఎందుకంత చిన్నచూపు చూస్తుందని ప్రశ్నించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యార్థినిలకు చదువు నుంచి దూరం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నియమించాలని గత ఏడాది విద్యార్థినులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని, స్పందించిన రాష్ట్ర ఎస్టీ చైర్మన్ కుంభ రవిబాబు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కళాశాలలో వసతి గృహంలో పర్యటించి అధ్యాపకులు వెంటనే నియమిస్తామని హామీ ఇచ్చారు. హామీని నేటికి అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కళాశాలలో అధ్యాపకులు నియమించక పోవడంతో చదువు ఎలా చదువుతారని ప్రశ్నించారు. తక్షణమే మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడలు పూర్తి స్థాయిలో నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కె.కొండమ్మ, మండల కమిటీ సభ్యులు స్వాతి, పి.కృష్ణ, కె.బలరాం పాల్గొన్నారు.

ఎన్నికల అనంతరం రోడ్డు విస్తరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం అబీద్ సెంటర్ నుండి బొడ్డేపల్లి వరకు విస్తరించనున్న రోడ్డు అనేక మలుపులు తిరుగుతుంది.ఎన్నికల అనంతరం రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు ఆల్ ఇండియా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైసిపి పార్టీ సీనియర్ నేత, రూరల్ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పోతల ప్రసాద్ వెల్లడించారు.ఆదివారం సాయంత్రం స్థానిక కళ్యాణ మండపంలో భవన యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ, 2024 ఎన్నికల తర్వాతే నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ రోడ్డు విస్తరణ 100 అడుగులకు కాకుండా 80 అడుగులకు మాత్రమే ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు మరో రెండు మూడు రోజుల్లో అధికారులకు అందుతాయని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ వైవి.సుబ్బారెడ్డిని కలవడం జరిగిందన్నారు.భవన యాజమానులతో కలిసి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని కలిసి ఇక్కడ పరిస్థితిని వివరించామన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు భవన యాజమానులను భయభ్రాంతులకు గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి 175 కి 175 స్థానాలు గెలవడం ఖాయమని, అందులో నర్సీపట్నం మొదటి వరుసలో ఉంటుందని స్పష్టం చేశారు.

నేతల భవిష్యత్తు కోసమే టిడిపి
బస్సు యాత్ర : ఎమ్మెల్యే పెట్ల

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:తెలుగుదేశం పార్టీ నేతల భవిష్యత్తు కోసమే బస్సు యాత్ర చేపడుతున్నారని, రాష్ట్ర ప్రజల కోసం కాదని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విమర్శించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శనివారం నర్సీపట్నంలో జరిగిన సభలో అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. తెలుగుదేశం హయాంలో రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడీ దొంగలు చంద్రబాబు నాయుడు, అయ్యన్నపాత్రుడేనని దుయ్యబట్టారు. టిడిపి ఏ బస్సు యాత్ర చేపట్టినా తమకు అభ్యంతరం లేదని, తమ పార్టీపై, పార్టీ నాయకులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 2014లో టిడిపి 600 హామీలు ఇచ్చి 60 హామీలు కూడా నెర వేర్చలేదని, ఇప్పుడు మరోసారి సరికొత్త హామీలతో భవిష్యత్తు గ్యారంటీ యాత్ర చేపడుతుందని హెద్దేవా చేశారు. వ్యవసాయదారులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రైతాంగాన్ని మోసం చేశారన్నారు. డ్వాక్రా రుణమాఫీ అంటూ డ్వాక్రా మహిళలను మోసం చేశారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి హామీలు గుప్పించి యువతను మోసం చేశారన్నారు. నర్సీపట్నంలో ఎంత మందికి ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. వృద్ధాశ్రమాలు కట్టిస్తామని వృద్ధులను, ఉచిత సైకిళ్లు ఇస్తామని హైస్కూల్ విద్యార్థులను, ఐప్యాడ్ ఇస్తామని కాలేజీ విద్యార్థులను, ఇంటింటికి మినరల్ వాటర్ ఇస్తామని గృహిణులను నమ్మించి మొండి చేయి చూపారన్నారు. సామాజిక పెన్షన్ల విషయంలో తెలుగుదేశం ఐదేళ్ల కాలంలో రూ.63వేలు ఇచ్చారని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఐదేళ్ల కాలానికి 1లక్షా 48వేల 500 ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన ప్రతి ఏటా అందిస్తున్నామన్నారు. నాలుగేళ్ల కాలంలో 98 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమన్నారు. మరో 30 ఏళ్లు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. వచ్చే ఎన్నికలలో అయ్యన్నపాత్రుడుకు ప్రజలు మరోసారి గట్టిగా బుద్ధి చెబుతారన్నారన్నారు.

ఇంటింటా సర్వే

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ పరిధిలో 28వ వార్డు అయ్యన్న కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో 28వ వార్డులో వైఎస్ఆర్సిపి నాయకురాలు గంటా లలిత ఆధ్వర్యంలో వార్డు వాలంటీర్లు ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ, ఈనెల 24వ తేదీ నుండి వచ్చే జులై నెల 24వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా 11 రకాల సమస్యలు ఉచితంగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, కొత్త రేషన్ కార్డు, ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, హౌసింగ్‌లో సమస్యలు, రేషన్ కార్డులో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సమస్యలను ఇంటి వద్దకే వాలంటీర్ ద్వారా తక్షణమే పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

జీపు జాతా ప్రారంభంలో నినాదాలు చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
- అంగన్‌వాడీల జీపు జాతా ప్రారంభం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: పోరాటాల ద్వారానే అంగన్వాడీల సమస్యలు పరిష్కారమౌతాయ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి, ఐసిడిఎస్ పరిరక్షణకు ఈనెల 25, 26, 27 తేదీలలో రంపచోడవరం డివిజన్‌లో నిర్వహించే జీపుజాతాను ఆదివారం మండలంలోని లాగరాయి గ్రామంలో సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు జెండా ఊపి ప్రారంభించారు. తొలిరోజున లాగరాయి, రాజవొమ్మంగి, దూసరపాము, జడ్డంగి, చెరుకుంపాలెం మీదుగా అడ్డతీగలకు జీపుజాతా చేరుకొంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి నిర్మల, యూనియన్ జిల్లా నాయకురాలు కె వెంకటలక్ష్మి,రాణి, సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు తదితరులు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనం, పెండింగ్ వేతనాలు చెల్లింపు, పని భారం తగ్గింపు, ఐసిడిఎస్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపు, అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపు, అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, వైసిపిర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంపు, అంగన్వాడీలకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా ఏర్పాటు, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లకు సమానంగా వేతనాల చెల్లింపు, హెల్పర్లకు ప్రమోషన్లు, అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు చిన్ని కుమారి, సంతోషి, మంగ, సత్యవేణి, సత్యవతి, వరలక్ష్మి, మేరి, రత్నకుమారి, లక్ష్మి, సునీత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలంలోని వేటమామిడి నుంచి దుశర్తి, రోళ్లగడ్డ, ధాన్యంపాలెం, రాయపల్లి, తదితర గ్రామాలకు ఈనెల 27న మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు రంపచోడవరం ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎండీ యూసఫ్ తెలిపారు. ఆయా ఫీడర్‌లోని 11కెవి విద్యుత్ లైన్ మరమ్మతులు, వైర్ల కిందనున్న చెట్లు, కొమ్మలు తొలగింపు, ఇతరత్రా నిర్వహణ పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఇఇ కోరారు.

ఖరగ్‌పూర్ డివిజన్‌లో కొనసాగుతున్న రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఖరగ్‌పూర్ డివిజన్‌లోని ఖరగ్‌పూర్-భద్రక్ సెక్షన్‌లోని బహనాగా బజార్ స్టేషన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా జూన్ 26, 28 తేదీలలో 10 రైళ్లను రద్దు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో జూన్ 26న 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22841 సంత్రాగచ్చి - తాంబరం ఎక్స్‌ప్రెస్, 07046 సికింద్రాబాద్ - దిబ్రూగర్ స్పెషల్, 07030 సికింద్రాబాద్ - అగర్తల స్పెషల్, 22856 తిరుపతి - సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్, 22878 ఎర్నాకులం - హౌరా ఎక్స్‌ప్రెస్, 22863 హౌరా - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్, 00636 అగర్తల - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లను, జూన్ 28న 22864 ఎస్ఎంవి బెంగళూరు - హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు.

పెంచలేదంటూనే పోటు

ఐదు రకాల ఛార్జీలతో మోత - వినియోగదారులపై పెరుగుతున్న విద్యుత్ భారం
దళిత మహిళలకు వర్తించని ఉచితం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ, బుచ్చెయ్యపేట విలేకరులు

బుచ్చెయ్యపేట మండలం చిన్నప్పన్నపాలెం జంక్షన్‌లో చిన్న షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు చల్ల రాజు. సర్వీస్ నెంబర్ 1156340083000423 షాపులో ఒక ఫ్యాన్, లైటు, ఫ్రిజ్ ఉన్నాయి. ఏప్రిల్‌కు ముందు వరకూ నెలకు రూ.300 వచ్చిన కరెంట్ బిల్లు ప్రస్తుతం రూ.700కు పైగా వస్తోంది. ఆయన ఈ ఏడాది మే 4 నుంచి జూన్ 2 వరకూ 65 యూనిట్ల విద్యుత్ వినియోగించినందుకు రూ.384 చెల్లిస్తే సరిపోతుంది. కానీ ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీ, ఇంధన సర్దుబాటు ఛార్జీ, సర్ ఛార్జీ, ఫిక్స్‌డ్ ఛార్జీ, ఎలక్ట్రిసిటీ డ్యూటీతో పాటు మరో రూ.361 కలిపి రూ.746 బిల్లు వచ్చింది.

విద్యుత్ భారం పడిన దుకాణదారుడు రాజు

పరవాడ మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో సర్వీస్ నెంబర్ 1171778895003969కు చెందిన దళితురాలు పొట్ల పైడమ్మకు మేలో 171 యూనిట్లకు విద్యుత్ బిల్లు రూ.868 వచ్చింది. ఈ బిల్లులో విద్యుత్ వినియోగ ఛార్జీ రూ.693కాగా, అదనంగా ఫిక్స్‌డ్ ఛార్జీ రూ.10, కస్టమర్ ఛార్జీ రూ.50, సర్ ఛార్జీ రూ.25, ఇంధన ఛార్జీ రూ.80, ఇడి రూ.10ని ప్రభుత్వం విధించింది. దళితులు వినియోగించే రెండు వందల యూనిట్లలోపు గృహ విద్యుత్‌ను ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేయాల్సివుంది. కానీ పైడమ్మ ప్రతి నెలా రూ.800 నుంచి వెయ్యి రూపాయల వరకు బిల్లు చెల్లిస్తోంది. వీరిద్దరిపైనే కాదు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పెక్కు మందిపై విద్యుత్ ఛార్జీల భారం ఏదో ఒక రూపాన పడుతోంది.

ఉచిత విద్యుత్‌కు నోచుకోని దళిత మహిళ పొట్ల పైడమ్మ

ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలకు డిమాండ్ ఛార్జీలు మినహా మిగిలిన కేటగిరీ వినియోగదారులపై ఛార్జీలు పెంచడంలేదని ఎపి విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటించినా... గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి వివిధ రూపాల్లో ఛార్జీలు వసూలు చేస్తోంది. విద్యుత్ వినియోగ బిల్లులకు సమానంగా ఇతర ఛార్జీలు తోడవడంతో కట్టలేని స్థితిలోకి వినియోగదారులు నెట్టబడ్డారు. గృహ విద్యుత్ టారిఫ్ పెంచకపోయినా ఇతర రూపాల్లో ప్రతి నెలా వివిధ పన్నుల రూపంలో వినియోగదారుల నుంచి ప్రభుత్వం డబ్బులు వసూలు చేస్తోంది. ప్రభుత్వం వివిధ ఛార్జీల రూపంలో వసూలు చేస్తున్న విద్యుత్ బిల్లులతో వినియోగాన్ని బట్టి భారం పడుతోంది. ఈ భారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో దాదాపు 17.50 లక్షల ఎల్‌టి వినియోగదారులు, 1748 హెచ్‌టి సర్వీసు వినియోగదారులపై ఏదో మేరకు పడుతూనేవుంది. పైడమ్మ వలే అర్హత కలిగిన ఎస్‌సి గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా వర్తించనప్పటికీ, ఇటువంటి వారిని గుర్తించి అమలుచేయకుండా ఉచిత విద్యుత్ భారం తగ్గించుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. వాడిన విద్యుత్ యూనిట్‌కు గతంలో ఆరు పైసలు వసూలు చేసిన ప్రభుత్వం 2022 ఏప్రిల్ నుంచి రూపాయికి పెంచింది. దీంతో గృహ వినియోగదారులు మినహా మిగిలిన కేటగిరీ వినియోగదారులపై విపరీతమైన భారం పడుతోంది.

28న విశాఖకు ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఐటి హబ్ విశాఖ.. అన్న భావన సార్థకం చేసేలాగ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐటి సంస్థల ప్రవేశానికి మార్గం సుగమం అవుతోంది. విశాఖలోని రుషికొండ ఐటి హిల్స్‌లో పూర్తయిన ఇన్ఫోసిస్ డవలప్‌మెంట్ సెంటర్ (ఐడిసి)లో ఈ నెల 28న కార్యకలాపాలను ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు తాజాగా ఇన్ఫోసిస్ హెచ్‌ఆర్ విభాగ నిపుణులు ఆదివారం తాజా విషయాలు వెల్లడించారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వేల సంఖ్యలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఇదో ఉద్యోగ వరంగా ఉంటుందని తెలిపారు. విశాఖతోపాటు దేశంలోని కోయంబత్తూరు, నోయిడా, కోల్‌కతా, హుబ్లీ, ముంబయి నగరాల్లోనూ ఈ ఇన్ఫోసిస్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని తెలుస్తోంది.

ఐటి హిల్స్‌పై 38 కంపెనీలు

విశాఖ రుషికొండ ఐటి హిల్స్‌పై 38 కంపెనీల వరకూ ఉన్నాయి. ఆక్యుపెన్సీ రేషియో పరిమితంగా ఉంది. మిలీనియం టవర్స్‌లోనే 14 ఫ్లోర్లకి కేవలం 4 ఫ్లోర్లలోనే ఐటి ఉద్యోగులున్నారు. విశాఖ మొత్తంగా 28 వేల మంది ఉద్యోగులు నేరుగా ఈ కంపెనీల్లో పనిచేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ (వర్క్ ఫ్రం హోం) చూసుకుంటే విశాఖ నగరం మొత్తంగా మరో 50 వేల మంది పనిచేస్తున్నారు. ఇన్ఫోసిస్ లాంటి దిగ్గజ ఐటి సంస్థ విశాఖకు రావడంతో ఆక్యుపెన్సీ రేటు పెరిగే అవకాశాలు భారీగా ఉన్నాయి. జీతాల విషయానికొస్తే రూ.15 వేల నుంచి రూ.18 వేలే ప్రారంభంలో ఐటి కంపెనీల నుంచి ఉద్యోగులు పొందుతున్నారు. రూ.50 వేలు మార్క్ దాటాలంటే ఇన్ఫోసిస్ లాంటివి రావాల్సిందేనని ఐటి నిపుణులు, ఐటి ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారంతా చెబుతున్నారు. తొలి దఫా 650 మందితోనూ, తర్వాత 1000 మందితో ఇన్ఫోసిస్ ఆఫీసు నడపనుంది. సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్, ఐటి ఎనేబుల్డ్ సర్వీసెస్ (ఐటిఇఎస్), ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి ఈ సంస్థ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

మైదాన ప్రాంతానికి తరలిపోతున్న వెదురు బొంగులు

యథేచ్ఛగా వెదురు బొంగుల అక్రమ రవాణా
- మాయమైపోతున్న అటవీ సంపద, పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మారేడుమిల్లిలో పగలు, రాత్రి అని తేడా లేకుండా వెదురు బొంగుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అరకొర పర్మిషన్‌లతో లక్షలాది రుపాయల విలువైన అటవీ సంపాదనను అక్రమమార్గంలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతోన్న మారేడుమిల్లిలో బొంగు చికెన్ ప్రసిద్ధి. ఇక్కడకు వచ్చే పర్యాటకులు బొంగుచికెన్ రుచి చూడకుండా వెళ్లరంటే అతిశయోక్తి కాదు. మారేడుమిల్లిలో తొలుత బొంగు చికెన్‌ను ఓ గిరిజనుడు పరిచయం చేశాడు. బొంగు చికెన్ తయారీకి వెదురుబొంగులు అవసరం. అటువంటి బొంగులు మారేడుమిల్లి పరిసర ప్రాంతాలతోపాటు ఏజెన్సీలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే లభ్యమౌతుంటాయి. ఈ నేపథ్యంలో అల్లూరి ఏజెన్సీ నుంచి ఇతర ప్రాంతాలకు, ముఖ్యంగా మైదాన ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు విస్తరించిన బొంగుచికెన్ వ్యాపారం, ఆయా దుకాణాల్లో లెక్కలేనన్ని దుకాణాలు వెలిసాయి. అయితే అక్కడ బొంగు చికెన్ తయారీకి అవసరమైన వెదురుబొంగులను మారేడుమిల్లి నుంచి అక్రమంగా నరికి తరలిస్తున్నారు. దీంతో ఏటా వేలాది వెదురుబొంగులు ఇక్కడ నుంచి మాయమై, అడవి సంపద నాశనం అవుతుందని పర్యాటక ప్రియులు ఆగ్రహం వ్యక్తం. చేస్తున్నారు. గతంలో వీఎస్ఎస్‌ల పరిధిలోని వేలాది బొంగులను అక్రమంగా నరికి తరలించుకుపోయినట్లు ఆరోపణలున్నాయి. ఇపుడు వ్యాపారులు ఇలా వెదురుబొంగులను మాయం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే రానున్న రోజుల్లో ఏజెన్సీలో వెదురుచెట్లు మాయమైనా ఆశ్చర్యపోనక్కర లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉధృత ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఉద్యమాన్ని రానున్న కాలంలో మరింత ఉధృతం చేయనున్నట్టు బిహెచ్ఇఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి ఎస్.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 815వ రోజుకు చేరాయి. దీక్షల్లో బిహెచ్ఇఎల్, హెచ్‌పిసిఎల్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు వస్తున్నందున కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెప్పడానికి ఇది మంచి సమయమన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. దీక్షల్లో యూనియన్ కోశాధికారి కె.నారపరెడ్డి, హెచ్‌పిసిఎల్ యూనియన్ సహాయ కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చంద్ర మోహన్ చిత్ర గీతాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశ్రాంత పోలీసు అధికారి మహ్మద్ ఖాన్ స్థాపించిన గీత్ సంగీత్ ఆధ్వర్యంలో డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం అలనాటి కథా నాయకుడు చంద్ర మోహన్ నటించిన చిత్ర గీతాలతో ఝుమ్మంది నాదం శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. అమ్మాజీరావు, కళ్యాణి పాడిన చిలిపి నవ్వుల నిన్ను చూడగానే, మహ్మద్ ఖాన్, శైలజా మీరజ్ పాడిన నీలి మేఘమా జాలి చూపుమా, భయ్యా శ్రీనివాస్, డాక్టర్ కృష్ణ హారిక పాడిన సీతాలు సింగారం పాటలు అలరించాయి.